క్లుప్తంగా

మెనూ సక్రమంగా అమలు చేయండి



దిగువ గంగంపల్లిలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న సీడీపీఓ అనురాధ

గోరంట్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని సీడీపీఓ అనురాధ సూచించారు. ఎగువగంగంపల్లి, యర్రయ్యగారిపల్లి, గోరంట్ల పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, చిన్నారుల హాజరు పట్టికలను పరిశీలించారు. మెనూ ప్రకారం చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని, తాజా కూరగాయలతో వంటలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రజిత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సుభద్ర

మడకశిర: పట్టణంలోని 7, 17వ వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుభద్ర గురువారం వినతి పత్రాన్ని అందించారు. పాత హరిజన వీధిలో వ్యక్తిగత మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని, మాంసం దుకాణాలను వేరే చోటుకు మార్చాలని, చాకలికుంటలోని ఇందిరమ్మ ఎస్సీ కాలనీకి అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా మడకశిర ఆర్టీసీ డిపోలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎంయూ, ఈయూ నాయకులు గురువారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు వేర్వేరుగా వినతి పత్రాలను అందించారు. ఎస్‌ఎంయూ, ఈయూ అధ్యక్షులు రామకృష్ణ, రఫిక్ మాట్లాడుతూ డిపోలో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, రద్దు చేసిన బస్సులను పునః ప్రారంభించాలని, మంత్రాలయం, కాణిపాకం ప్రాంతాలకు కొత్త సర్వీసులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎం ఆఫీస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని విన్నవించారు.

'నేను బడికి పోతా' ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిర: నేను బడికి పోతా కార్యక్రమంపై విద్యాశాఖ అధికారులు గురువారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బడి బయట ఉన్న, మధ్యలో బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తి, హెచ్‌ఎంలు రాఘవయ్య, శకంతలమ్మ, సీఆర్పీలు, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీలో 50 శాతం ఉత్తీర్ణత

లేపాక్షి: ఇంటర్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో లేపాక్షి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 50 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా గురువారం తెలిపారు. బైపీసీలో 25 మందికి గాను 20 మంది, సీఈసీలో 14 మందికి 7 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఆయన పేర్కొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్‌లో పాల్గొన్న సీడీపీఓ, అంగన్‌వాడీ సిబ్బంది

లేపాక్షి: మండలంలోని నాయనిపల్లి, కల్లూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో సీడీపీఓ రెడ్డిరమణమ్మ ఆధ్వర్యంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే, అక్షరాభ్యాసం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ 3 సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించి, ప్రీస్కూల్‌కు అలవాటు పడేలా చేయాలని వివరించారు. అనంతరం 5 సంవత్సరాలు పూర్తయిన అంగన్‌వాడీ పిల్లలను సత్కరించి ప్రాథమిక పాఠశాలకు చేరడానికి సిఫార్సు చేశారు. అనంతరం చిన్న పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, బీపీసీ వరణ్, ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్‌రఫీక్, ఎంయస్‌కే జ్యోతి, కార్యకర్తలు సహాయకులు, తల్లులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారు?



చిలమత్తూరు: అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం, సీపీఐ మండల నాయకులు



లేపాక్షి: తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

చిలమత్తూరు: సాగు పెట్టుబడి సాయం రైతులకు ఎప్పుడిస్తారని ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకులు ప్రశ్నించారు. రైతుల సమస్యలపై గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ యూనస్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పెట్టుబడి సాయం ఇస్తామని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదన్నారు. పంటల సాగుకు డబ్బు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెట్టుబడి సాయం అందించడంతోపాటు రైతులకు రూ. 2 లక్షల వరకూ రుణాలను మాఫీ చేయాలని, కౌలు రైతులకు ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి రైతుకూ రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. మండల రైతు సంఘం నాయకులు, సీపీఐ నేత గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండల వ్యాప్తంగా రైతుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు నాయకులు గురువారం తహసీల్దార్ బాలనరసింహులకు వినతి పత్రం అందజేశారు. పంటల సాగుకోసం రూ. 20 వేలు బ్యాంకు ఖాతాలో జమ చేయాలని, 50 ఏళ్ల వయస్సు దాటిన రైతులకు పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు గోవిందరెడ్డి, వెంకటేశప్ప, శంకర్‌రెడ్డి, హరి, నాగప్ప, గంగప్ప, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవీన్ నిశ్చల్ జన్మదిన వేడుక



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యకర్తలు

హిందూపురం: జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ ఆగ్రో చైర్మన్ నవీన్‌నిశ్చల్ జన్మదిన వేడుకలు హిందూపురంలో గురువారం పార్టీ నాయకులు, అభిమానుల మధ్య ఘనంగా జరిగాయి. ఏపీ ఆగ్రోస్ చైర్మన్ కార్యాలయం వద్ద నవీన్‌నిశ్చల్ కేక్ కటింగ్ చేసి పార్టీ నాయకులందరికీ పంచిపెట్టారు. అభిమానులు క్రేన్ ద్వారా గజమాల తీసుకొచ్చి ఆయన్ను ఘనంగా సత్కరించారు. జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బోయపేట అనూష, ఆనంద్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు స్టీల్‌ప్లేట్స్, గ్లాసులు, పెన్సిల్ పాకెట్స్ అందజేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, భాస్కర్, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీదేవి, లలిత సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే విద్యాభివృద్ధి



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ తిరుమలేష్, పుష్పాంజలిరెడ్డి

చిలమత్తూరు: విద్యారంగంలో నూతన సంస్కరణలు తీసుకువచ్చి విద్యావ్యవస్థను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని దేమకేతేపల్లి సర్పంచ్ ఈడిగ తిరుమలేష్ అన్నారు. దేమకేతేపల్లి పంచాయతీ ఓబుళాపురంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని బెంగళూరు నగరానికి చెందిన పుష్పాంజలిరెడ్డి సొంత నిధులు వెచ్చించి మరమ్మత్తులు చేయించగా ఆమెతో కలిసి గురువారం ఆయన స్కూల్ భవనాన్ని ప్రారంభించారు. తిరుమలేష్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించి కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారన్నారు. సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కాగా పుష్పాంజలిరెడ్డి దాతృత్వాన్ని గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, వార్డు సభ్యురాలు జయమ్మ, పాఠశాల కమిటీ చైర్మన్ హేమలత, గ్రామ పెద్దలు శంకరప్ప, నరసింహప్ప పాల్గొన్నారు.

కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉంటాం

- మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత ఈరలక్కప్ప



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఈరలక్కప్ప

అమరాపురం: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప సూచించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. జగనన్న తన పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారన్నారు. పార్టీ ఓటమిపై నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్య వచ్చినా వారి వెన్నంటి ఉంటామన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమైనా ఇంతవరకూ అమ్మ ఒడి డబ్బు తల్లుల ఖాతాలో జమ కాలేదన్నారు. టీడీపీ సర్కార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై పోరాటం చేద్దామన్నారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగనన్న ఆదేశాల మేరకు నడుచుకుందామన్నారు. అనంతరం టీటీడీ కళ్యాణ మంటపంలో అమరాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శాంతకుమార్ కూతురు చందుశ్రీ సురేష్‌బాబుల వివాహ కార్యక్రమంలో ఈరలక్కప్ప పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ వీరక్యాతరాయ, ఎంపీటీసీలు నారాయణ, హనుమంతరాయ, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, నాయకులు పీఆర్.మూర్తి, జే.కె.మూర్తి, ఇషాక్, నటరాజు, వికాస్, చిత్తప్పయాదవ్ పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఈరలక్కప్ప

గుడిబండ: మండల కేంద్రంలోని తిరుమల తిరుపతి కల్యాణ మండపంలో గురువారం జరిగిన వివాహ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప పాల్గొన్నారు. వేదమంత్రోచ్చారణ మధ్య ఒక్కటైన వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీటీసీ సభ్యుడు భోజరాజు, నరసింహమూర్తి, హనుమంతు పాల్గొన్నారు.

పెండింగ్ పాఠ్య పుస్తకాలు అందించండి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి

హిందూపురం టౌన్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పాఠ్యపుస్తకాలను వెంటనే అందజేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సమావేశం నిర్వహించారు. బాబావలి మాట్లాడుతూ ఈ నెల 13న ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైనా నేటికీ పూర్తి స్థాయిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించలేదన్నారు. పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని టీడీపీ హామీ ఇచ్చిందని, దానిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చంద్రశేఖర్, తరుణ్, జస్వంత్, మంజునాథ్, అమ్రేష్ పాల్గొన్నారు.

'గ్యాంగ్‌వార్' చిత్రం యూనిట్ సేవా కార్యక్రమం



చిన్నారికి బ్యాగు అందిస్తున్న హీరో అభిలాష్

పావగడ: పట్టణంలోని మార్కెట్ యార్డ్ ప్రాంతంలో కన్నడ చలన చిత్రం 'గ్యాంగ్ వార్' షూటింగ్ నిర్వహిస్తున్న యూనిట్ సభ్యులు సేవా కార్యక్రమం చేపట్టారు. హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని రొప్పం గ్రామం పరిధిలోని 3 అంగనవాడీ కేంద్రాల్లో వర్ధమాన నటుడు అభిలాష్, యూనిట్ సభ్యులు విద్యా సామగ్రి వితరణ చేశారు. దర్శకుడు అరవింద్ కౌశిక్, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు సుశీలమ్మ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ రంగస్వామి

పరిగి: విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్యను బోధించాలని డిప్యూటీ డీఈఓ రంగస్వామి సూచించారు. గురువారం ఆయన పరిగిలోని ఎమ్మార్సీలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించడానికి తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. దీక్షా రిజిస్ట్రర్, స్పీకాన్ రిజిస్ట్రేషన్, స్టూడెంట్ కిట్‌పై సమగ్రంగా చర్చించారు. ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి, శుభ్రతను పరిశీలించారు.

మత స్వేచ్ఛ హక్కును పరిరక్షించుకోవాలి



వార్షికోత్సవంలో పాల్గొన్న పాస్టర్లు

హిందూపురం టౌన్: దేశంలో మత స్వేచ్ఛ హక్కును పరిరక్షించాలని వివిధ చర్చిల పాస్టర్లు, నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని సీఅండ్‌బీజీ మిషన్ కాంపౌండ్ చర్చిలో గురువారం ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ 28వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కొన్ని మతోన్మాద శక్తుల వల్ల దేశంలో క్రైస్తవులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అలాంటి చర్యలు మత స్వేచ్ఛ హక్కును కాలరాసేలా ఉన్నాయన్నారు. మణిపూర్ విధ్వంసకాండ లాంటి ఘటనలు దేశంలో పునరావృత్తం కాకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ మూడవ పేరాను రద్దు చేయాలని, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, హిందూపురం పాస్టర్ ఫెలోషిప్స్ పెద్దలు సూర్యప్రకాష్, సంఘం పాస్టర్ స్టీఫెన్ రాజ్, పెద్దలు సాల్మన్ రాజ్, దేవరాజు, అరుణ్ కుమార్, జార్జి బాబు, జిల్లా యూత్ కమిటీ సభ్యులు డేనియల్, ప్రభుదాస్, అబ్రహం పాల్గొన్నారు.

ఘనంగా కెంపేగౌడ జయంతి



కెంపేగౌడ చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

పావగడ: బెంగళూరు నగర నిర్మాత నాడప్రభు కెంపేగౌడ 515వ జయంతి వేడుకలు గురువారం స్థానిక తాలూకా కార్యాలయంలో తహసీల్దార్ వరదరాజు నేతృత్వంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కెంపేగౌడ చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. ప్రధాన వక్త అధ్యాపకుడు ముద్దీరప్ప మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన బెంగళూరు నగరాన్ని 1561లో కెంపేగౌడ నిర్మించారన్నారు. చెరువులు, కోటలు కళాత్మకంగా నిర్మించారన్నారు. కుంచిటిగ వక్కలిగ సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు మాట్లాడుతూ కెంపేగౌడ ఆదర్శాలు, సిద్ధాంతాలను యువత అలవర్చుకోవాలన్నారు.

మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచండి

మడకశిర: మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన గురువారం జరిగిన మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అక్రమ లే ఔట్లను క్రమబద్ధీకరించి ఆదాయాన్ని పెంచాలని ఆదేశించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై శ్రద్ధ చూపాలని ఆదేశించారు. కౌన్సిలర్లు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కమిషనర్ రంగస్వామి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నూతన బస్సు ప్రారంభం:

విజయవాడ–మడకశిర ఆర్టీసీ సర్వీస్‌ను స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, అధికారులు పాల్గొన్నారు. అనంతరం యాదవ కల్యాణ మంటపంలో నియోజకవర్గంలోని వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బందితో ఎమ్మెల్యే సమావేశమై 1న జరగనున్న పింఛన్ల పంపిణీపై సమీక్షించారు. అనంతరం మడకశిర ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం పట్టణంలో వారపు సంతను ఎమ్మెల్యే పరిశీలించారు. అధిక సుంకం వసూలు చేస్తున్నారని వ్యాపారులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి



మాట్లాడుతున్న సీడీపీఓ నాగమల్లేశ్వరి

రొళ్ల: దొడ్డేరి సెక్టర్ పరిధిలోని వివిధ గ్రామాల అంగనవాడీ కార్యకర్తలు, హెల్పర్లతో సీడీపీఓ నాగమల్లేశ్వరి గురువారం రత్నగిరిలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. మూడేళ్ల పైబడి ఆరేళ్ల లోపు వయసున్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందజేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ, అంగనవాడి కార్యకర్తలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ



బసనపల్లిలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని మద్దనకుంట, బసవనపల్లి, వలస గ్రామ పంచాయతీలో గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఉపాధి హామీ కింద చేపట్టిన పనులపై నిర్వహించిన ఆడిట్‌కు సంబంధించి డీఆర్పీ మారుతీ ఆధ్వర్యంలో గురువారం బసవనపల్లిలో గ్రామసభ నిర్వహించారు. గ్రామాల్లో జరిగిన పనుల వివరాలను సభలో చదివి వినిపించారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని డీఆర్పీ రైతులకు సూచించారు. ఏపీఓ జగదీష్, టీఏలు, ఎఫ్‌ఏలు, కూలీలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

రొళ్ల: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మడకశిర సెబ్ సీఐ ఎస్.ధీరజ్‌రెడ్డి సీజ్ చేశారు. రొళ్ల మండలం హెచ్‌ఎం పల్లికి చెందిన ఓవ్యక్తి, మడకశిర మండలం గోవిందాపురం గొల్లహట్టికి చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు ట్రాక్టర్లలో ఇసుకను రొళ్ల వైపు తరలిస్తుండగా తనిఖీ చేసినట్లు సీఐ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

2న వారపు సంత వేలం

సోమందేపల్లి: మేజర్ గ్రామ పంచాయతీ సోమందేపల్లిలో వారపు, దిన సంత నిర్వహణకు జూలై 2న వేలం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి రామాంజినేయులు గురువారం తెలిపారు. 12 షాపింగ్ కాంప్లెక్స్ గదులకు వేలం నిర్వహిస్తామని తెలిపారు.

డయేరియాపై జాగ్రత్తలు తీసుకోండి

సోమందేపల్లి :డయేరియా నివారణపై దృష్టి పెట్టాలని డీఎంహెచ్‌ఓ మంజులవాణి వైద్యాధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులు పరిశీలించారు. క్షయ నివారణ కోసం చేపట్టిన బీసీజీ వ్యాక్సిన్‌పై ఆరాతీశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమలో వైద్యులు హరికుమార్, ఓంకార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌జీ విద్యార్థుల ప్రతిభ

హిందూపురం: ఇంటర్ సప్లిమెంటరీ అడ్వాన్స్ పరీక్షల్లో హిందూపురం ఎల్‌ఆర్‌జీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఎంపీసీ విభాగంలో రంగస్వామి 470 మార్కులకు గాను 466, బైపీసీలో టీఎస్ అనన్య 440మార్కులకు గాను 437 మార్కులు సాధించారన్నారు. ప్రతిభావంతులను సెక్రటరీ బాలసుందరం, ఏఓ సంజీవరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

హాస్టళ్ల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ రాజేశ్వరీ, ఎంఈఓ లక్ష్మీదేవి

పరిగి: మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లు, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను తహసీల్దార్ రాజేశ్వరి, ఎంఈఓ లక్ష్మీదేవి గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించారు. ఏవైనా సమస్యలున్నాయా అంటూ విద్యార్థులను ఆరా తీశారు. కేజీబీవీ ఎస్‌ఓ సువర్ణమ్మ, వార్డెన్ వీరనారాయణ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా



గుంతలో పడిపోయిన ట్రాక్టర్

పరిగి: మండలంలోని పైడేటి సమీపంలో గురువారం ఓ ట్రాక్టరు గుంతలో బోల్తా పడింది. ఈఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. పైడేటి సమీపంలో సింగిల్ రోడ్డు పక్కన మట్టి రోడ్డు కుచించుకుపోయింది. రోడ్డు పక్కన గుంతలు ఉండటంతో కొత్తగా ఇటువైపు వచ్చిన వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గురువారం ట్రాక్టర్ ఇటువైపు వస్తూ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవరు చాకచక్యంగా వ్యవహరించి ప్రాణాలతో బయటపడ్డాడని స్థానికులు తెలిపారు.

పొలం పనుల్లో రైతులు బిజీ




తమ్మదేపల్లిలో వేరుశనగ పంటలో కలుపు మొక్కలు తీసి వేస్తున్న కూలీలు



అమరాపురం మండలంలో వేరుశనగ పంటలో గుంటక తోలుతున్న రైతులు

అమరాపురం: మండలంలో ముందస్తుగా వర్షాలు కురవడంతో రైతులు వివిధ రకాల పంటల సాగు చేశారు. వేరుశనగ పంటలో కలుపు మొక్కలు తొలగించడం, వక్క, తమలపాకు తోటలకు ఎరువులు వేయడంలో రైతులు బిజీగా ఉన్నారు. వ్యవసాయ పనులతో కూలీలకు డిమాండ్ పెరుగుతోంది. కలుపు మొక్కలు తొలగించి ఎరువులు వేస్తే పంటలు ఏపుగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయని రైతులు సిద్దప్ప, మంజునాథ, రామాంజినేయులు, హనుమంతరాయ తదితరులు తెలిపారు. మండలంలో వేరుశనగతో పాటు అంతర పంటలుగా అలసంద, పెసలు, ఆముదం, కంది సాగు చేశారు.

బ్లాస్టింగ్ పనులు నిలిపివేయాలి



క్వారీని పరిశీలిస్తున్న నాయకులు

సోమందేపల్లి: పాపిరెడ్డిపల్లి సమీపంలో అక్కమ్మ కొండపై బ్లాస్టింగ్ పనులు నిలిపి వేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రీ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం వారు కొండపై క్వారీని సందర్శించారు. అక్కమ్మ ఆలయం గిరిజనులకు ఆరాధ్యదైవమన్నారు. గుజరాత్‌కు చెందిన కాంట్రాక్టర్లు కొండపై క్వారీలో బ్లాసింగ్ చేస్తుండటంతో పేలుళ్ల తీవ్రతకు ఆలయానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. నాయకులు రామాంజి నాయక్, హరిలాల్ నాయక్, రంజిత్ నాయక్, రవీంద్ర నాయక్ పాల్గొన్నారు.